సేవల్లో మేటి.. బ్యాంకులతో పోటీ

- విస్తృత సేవల్లో ఎమ్మిగనూరు పోస్టాఫీసు
- కార్పొరేటుకు దీటుగా బ్యాంకింగ్ సేవలు
- 11వేల మంది ఖాతాదారులు
- ఉత్తమ సేవలకు అవార్డులు


ఎమ్మిగనూరు పోస్టాఫీసు

ఎమ్మిగనూరు: శాస్త్ర, సాంకేతిక రంగాలతో పాటు బ్యాంకింగ్ రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా పోస్టల్ సేవలు విస్తృతమవుతున్నాయి. కేవలం ఉత్తర, ప్రత్యుత్తరాలకే పరిమితం కాకుండా ఆన్‌లైన్, బీమా, సేవింగ్ బ్యాంక్, నేషనల్ సేవింగ్, ఆర్‌పీఎఫ్, ఎస్‌సీ ఎస్ఎస్, కిసాన్ వికాస్ వంటి పథకాలతో ప్రజలకు మరింత తపాలా శాఖ చేరువయ్యింది. ఇంటర్‌నెట్ సేవలు, అంతర్జాతీయ నగదు మార్పిడిని కూడా తపాల శాఖలో ప్రవేశపెట్టారు. ఈ సేవలన్నీ అందిస్తూనే కార్పొరేట్ బ్యాంకింక్ సంస్థలకు సవాలు విసురుతూ ఎమ్మిగనూరు పోస్టాఫీసు ఖాతాదారులకు సేవలందిస్తూ జిల్లాలో, ఆదోని డివిజన్ పరిధిలో ప్రత్యేక గుర్తింపు సాధించింది. రెండు పర్యాయాలు ఉత్తమ పురస్కారాలు సొంతం చేసుకుంది.

బ్యాంక్‌లకు దీటుగా

తపాలశాఖా ప్రధాన శాఖ (మెయిన్ బ్రాంచ్) ఎమ్మిగనూరులో ఉంది. ఇందులో 22 మంది సిబ్బంది సేవలందిస్తున్నారు. దీనికి అనుబంధింగా 15 సబ్ పోస్టాఫీసులు ఉన్నాయి. నందవరం, గుడేకల్, బనవాసి, తేరుబజారు, నాగలదిన్నె, ముగతి, కడివెళ్ల తదితర గ్రామాల్లో మొత్తం 15 సబ్ పోస్టాఫీసుల్లో ప్రజలకు విస్తృత సేవలందిస్తున్నాయి. ఇక్కడ కార్పొరేట్ బ్యాంక్‌లకు దీటుగా 11వేల బ్యాంక్ ఖాతాలు ఉన్నాయి. ఎమ్మిగనూరు ప్రధాన పోస్టాఫీసులో 2017–18, 2018–19 సంవత్సరాల్లో సుకన్య సమృద్ధి యోజన ద్వారా బాలికలకు ఖాతాలు తెరిచి భరోసాగా నిలిచింది.

తపాలా సేవలు

- పౌరుల ఆధార్ నమోదుతో పాటు తప్పొప్పుల సరిచేసేందుకు ఆధార్ సెంటర్‌ను కూడా పోస్టాఫీసుకు కేటాయించారు. ఎమ్మిగనూరు పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది ఆధార్ సేవలను నిత్యం వినియోగించుకుంటున్నారు.
- తిరుమల, తిరుపతి దేవస్థానంకు చెందిన రూ.300టికెట్లను పోస్టాఫీసు ద్వారా బుక్‌చేసుకోవచ్చు. అదేవిధంగా పుష్కరాలకు చెందిన తీర్థాలు, పుష్కర జలాలను తపాలశాఖ ద్వారా పొందవచ్చు.
- 'పికప్ మెయిల్స్ త్రూ పోస్ట్‌మ్యాన్' ద్వారా తపాలా సేవల్లో భాగమైన పోస్టుకార్డులు, కవర్లు, స్టాంపులు వంటి వాటిని పోస్టుమ్యాన్ మన ఇంటి వద్దకే వచ్చి విక్రయిస్తారు. ఏదైనా కార్యాలయం, షోరూమ్ తదితరాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలు, కరపత్రాలను ఇంటింటికి పంపవలసి వచ్చినప్పుడు పోస్టుమ్యాన్ వీటిని డైరెక్టు పోస్టుద్వారా చేరవేస్తాడు.
- ఏవైనా గృహోపకరణాలు, బియ్యం బస్తాలు, ఇతర వస్తువులను మనకు కావాలసిన చోటుకు చేరవేసేందుకు తపాలా శాఖ లాజిస్టిక్ సేవలను కూడా ప్రారంభించింది. సామానుల ప్యాకింగ్ దగ్గరి నుంచి రవాణా, డెలివరీ వరకూ అన్నింటికీ శాఖ సిబ్బందే బాధ్యత వహిస్తారు.
- ఈఎంఎస్ స్పీడ్‌పోస్టు ద్వారా మనకు చెందిన సమాచారాన్ని లేదా వస్తువులను 104దేశాల్లోని వారికి పంపే వెసులుబాటు ఉంది.

సేవాసంస్థగా భావిస్తున్నాం

తపాలా శాఖను ఓ సేవా సంస్థగా భావిస్తూ ప్రతి ఉద్యోగి విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ శాఖకు పూర్వవైభవం తీసుకువచ్చి ప్రతిఒక్కరి అభిమానాన్ని చూరగొనేందుకే 'ఆమ్ ఆద్మీ పోస్టు' అనే కొత్త నినాదంతో 2009లో పోస్టల్ శాఖను ఆధునీకరించారు. 2014నుంచి ప్రత్యేక పథకాలు అమలవుతున్నాయి.

– గురు లింగయ్య, పోస్టుమాస్టర్, ఎమ్మిగనూరు

బీమాతో ఖాతాదారులకు దీమా

ఎమ్మిగనూరు మెయిన్ పోస్టాఫీసులో సేవింగ్ అకౌంట్లు 4,500, ఆర్‌డి అకౌంట్లు 4,500, బాలికల కోసం ఎస్ఎస్‌ఏ (సుకన్య సమృద్ధి యోజన) 2000 చొప్పున మొత్తం 11 వేలకు పైగా బ్యాంక్ అకౌంట్లు ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. తపాలా కార్యాలయాల్లో పొదుపు ఖాతా, నెలసరి ఆదాయ పథకం ఖాతాదారులకు ప్రమాద జీవిత బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. అలాగే ఇతరులు కూడా బీమా చేయవచ్చు. గ్రామీణ ప్రాంతాల వారికి గ్రామీణ తపాలా జీవిత బీమా సౌకర్యాన్ని ప్రత్యేకంగా కల్పిస్తున్నారు. రూ.లక్ష బీమా చేసిన వారు ఇతర బీమా కంపెనీల కన్నా అధికంగా సంవత్సరానికి రూ.5వేల బోనస్‌ను పొందవచ్చు. తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలబీమా, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలతో పాటు గతం నుంచి అమలులో ఉన్న బీమా పథకాలను తపాలశాఖ చేపడుతోంది.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి


అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: దీపావళి సందర్భంగా ఏర్పాటు చేయనున్న బాణసంచా స్టాల్స్‌లో ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. శనివారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదోని డివిజన్‌లోని బాణసంచా దుకాణాల యాజమానులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిస్టాల్ వద్ద 200 లీటర్ల సామర్థ్యమున్న డ్రమ్ముల్లో నీటిని ఏర్పాటు చేయించాలన్నారు. ఒక్కో దుకాణం వద్ద ఇసుక నింపిన బకెట్లు ఉంచాలని, దుకాణానికి దుకాణానికి మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా దుకాణాలకు ఎలాంటి మంటలు వ్యాపించకుండా నిరోధించే మెటీరియల్ రేకులతో షెడ్లు నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. చిన్నారులకు బాణాసంచా విక్రయించరాదన్నారు. ఐఎస్ఐ స్టాండర్డ్‌తో ఉన్న టపాసులను మాత్రమే అమ్మేవిధంగా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రగౌడ్, నిజాముద్దీన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు సూర్యమోహన్‌రావు, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి పూజలు


పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక


భాగ్యలక్ష్మి

ఆదోని రూరల్: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని భాగ్యలక్ష్మి ఎంపికయ్యింది. మండలంలోని పెద్దతుంబళం నేషనల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని భాగ్యలక్ష్మి ఎస్‌జీఎఫ్ అండర్–17 ఖోఖో పోటీల్లో ఆదోని నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యిందని కరస్పాండెంట్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని భాగ్యలక్ష్మి, వారి తల్లిదండ్రులు వరలక్ష్మి, నరసింహులను పాఠశాల యాజమాన్యం అభినందించారు.

12 నుంచి ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘు నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఆదోని పట్టణంలో నవంబర్ 12, 13 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ జిల్లా 30వ మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా మహాసభల కరపత్రాలను విద్యార్థి సంఘు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. విద్య ప్రైవేటీకరణ, కషాయికరణకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సమీర్, ఖాదర్, దస్తగిరి, శంకర్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయండి


సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిరాలదొడ్డికి చెందిన నరసమ్మ

ఎమ్మిగనూరుటౌన్: తన పేరుపై వున్న ఇంటిని తన వదిన అనంతమ్మ, ఆమె కుమారుడు దేవరాజు అక్రమంగా వారి పేరుపై చేయించుకున్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని మండల పరిధిలోని సిరాలదొడ్డి గ్రామానికి చెందిన నరసమ్మ కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్‌తో పాటు తహశీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన గ్రామకార్యదర్శితో పాటు మిగిలిన వారిపై కూడా చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేసి ఆదుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు

వంకదారు శ్రీనాథ్‌గుప్తాకు డాక్టరేట్


డాక్టరేట్ తో శ్రీనాథ్‌గుప్తా

ఆదోని అర్బన్: ఆదోని అవోపా, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తాకు సామాజిక సేవలో గౌరవ డాక్టరేట్ దక్కింది. శనివారం తమిళనాడు రాష్ట్రంలోని హోసూరు పట్టణంలో ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ వారు హోటల్ హిల్స్‌లో గౌరవ డాక్టరేట్‌ను సోషల్ సర్వీస్ కేటగిరీలో ప్రదానం చేశారు.

ఆలయంలో వెండి కిరీటం చోరీ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట గ్రామంలోని శ్రీ మహాలింగేశ్వరస్వామి దేవాలయంలో శనివారం స్వామి వెండి కిరీటం చోరీకి గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. వెండి కిరీటాన్ని చోరీ చేసిన వ్యక్తి దేవాలయం పరిసర ప్రాంతంలో అనుమానస్పదంగా తిరిగినట్లు సీసీ కెమోరాలో రికార్డ్ అయినట్లు ఆలయ పూజాలు గుర్తించినట్లు తెలిసింది. చోరీ కాబడిన వెండి కిరీటం విలువ రూ. 50 వేలు ఉంటుందని నిర్వహకులు చెబుతున్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

ఎమ్మిగనూరురూరల్: బాలికలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. శనివారం మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఫాదర్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లలర్పించారు. గ్రామ వీధుల్లో బాలికలను రక్షించుకుందామంటు ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం బాలురకు పోటీగా బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మీ భవిష్యత్తును మంచిగా మలుచుకోవాలన్నారు. బాలికలపై అనునిత్యం దాడులు జరుగుతునే ఉన్నాయని, వాటిని అరికట్టడం మనందరి బాధ్యత అని తెలిపారు. సీడీపీవో సఫర్నీసాబేగం, ఎంఈవో ఆంజనేయులు, హెచ్ఎం నరసప్ప, ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ సుదర్శన్‌రెడ్డి, కోఆర్డినేటర్స్ ధనుంజయ్,బాబు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

నందవరం : రీ సర్వేలో భాగంగా వచ్చిన భూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ గ్రామసభలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే భూ సమస్యలను దరఖాస్తు రూపంలో అందించాలని, అర్జీలను రెండు వారాల్లో పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో డివిజన్ సర్వేయర్ శ్రీనివాసురావు, రీ సర్వే డీటీ మహేష్, ఆర్ఐ జెర్మియా, మండల సర్వేయర్ అక్బర్‌బాషా, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలివ్వాలి

ఆదోని రూరల్: రీ సర్వేలో భాగంగా సొంత భూములు రైల్వే భూములుగా చూపించి, ఆన్‌లైన్ నుంచి తొలగించారని, వాటిని మళ్లీ రైతుల పేర్లపై ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని రైతు సంఘం మండలాధ్యక్షులు కె.శేఖర్, రైతులు కోరారు. శనివారం మండలంలోని కుప్పగల్లు గ్రామంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పెద్దయ్యకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సొంత భూములను రైల్వే భూములుగా చూపించి కొందరు రైతుల పేర్లను తొలగించారన్నారు. వెంటనే విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు సుభాన్, బొజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేయించండి

కౌతాళం: సాగు చేస్తున్న రైతులకు పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చి ఆన్‌లైన్లో పేరు నమోదు చేయాలని రైతుల సంఘం నాయకులు డిమాండు చేశారు. వినతి పత్రాన్ని సుళేకేరి గ్రామంలో జరిగిన గ్రామసభలో తహసీల్దారు మల్లికార్జునస్వామికి అందజేశారు. రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య మాట్లాడుతూ చాల గ్రామాల్లో భూములకు సంబంధించి కొలతలు తేడాలు, అడంగాళ్లలో పేరు లేకపోవడం, ఒకరి భూమి ఇంకొకరికి నమోదు కావడం వల్ల గొడవలు జరుగుతున్నాయన్నారు. ఈ అవకతవకల్ని సరిచేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. రైతు సంఘం నాయకులు నారాయణ, ఎల్లయ్య, హనుమయ్య, మూకమ్మ మాంతయ్య, ఆదివాసులు పలువురు పాల్గొన్నారు.

చేపల పెంపకానికి వేలం వాయిదా


వేలం వాయిదా ప్రకటిస్తున్న మత్స్యశాఖ డివిజన్ పర్యవేక్షకులు నాగరాజు, ఎస్ఐ చంద్రమోహన్


కోసిగి: పులికనుమ రిజర్వాయర్‌లో చేపల పెంపకానికి బహిరంగ వేలం పాట వాయిదా వేస్తున్నట్లు ఆదోని డివిజన్ మత్స్యశాఖ పర్యవేక్షకులు నాగరాజు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన , ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు మధ్య బహిరంగ వేలం పాట ప్రారంభించారు. రిజర్వాయర్‌లో 01-07-2024 నుంచి 30-06-2025 వరకు చేపల పెంపకానికి అనుమతి వచ్చినట్లు ప్రకటించారు. ఇందుకు గాను ప్రభుత్వం నియమనిబంధనల మేరకు నిర్ణీత సర్కారు సవాలు రూ.74,879 ప్రకటించింది. అయితే వేలం పాటుకు వచ్చిన వివిధ పార్టీల నాయకులు ప్రభుత్వం కేటాయించిన సమయంలో ఇది వరకే నాలుగు నెలలు గడిచి పోయిందని, సర్కారు సవాలు విలువ తగ్గించి వేలం పాట వేయాలని అధికారి నాగరాజును నిలదీశారు. ఆయన ఉన్నత అధికారులతో ఫోన్‌లో సంప్రదించినా సర్కారు సవాలు తగ్గించడం కుదురదని తేల్చి చెప్పారు. సర్కారు సవాలు తగ్గించకపోతే మరో 4నెలల గడువు పొడగించాలని అధికారితో వాదించారు. దీంతో చేసేది ఏమి లేక వేలం పాట వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మరో సారి తేదీ ప్రకటించి వేలం వేస్తామని చెప్పారు.

మెనూ తప్పనిసరిగా అమలు చేయాలి


మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న తహసీల్దార్ కుమారస్వామి

గోనెగండ్ల : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని తహసీల్దార్ కుమారస్వామి సూచించారు. శనివారం మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ డొక్క సీతమ్మ గోరుముద్ద ప్రథకంలో భాగంగా వంట నిర్వహకులు మెనూ ప్రకారం తప్పనిసరిగా ప్రతి రోజు మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. మెనూ పాటించని వంట ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ జనార్దన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


ఎన్‌సీసీ శిక్షణ పత్రాలు అందుకున్న విద్యార్థులతో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్

గోనెగండ్ల:పాటల పోటీలు, పరుగు పందెం పోటీలలో ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థునులు బహుమతులను గెలుచుకున్నట్లు ప్రిన్సిపాల్ షాహీనా పర్వీన్ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో ఈనెల 17 నుంచి 26వ తేదీ వరకు స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులు శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. ఈ పది రోజులో వివిధ క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ధ్రువపత్రాలను ప్రదానం చేయడం జరిగిందన్నారు. అక్కడ నిర్వహించిన పాటల పోటీలలో 9వ తరగతికి చెందిన సంగీత కలావర్షిణి ప్రథమ బహుమతి, పరుగు పందెంలో వైష్ణవి ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతిని కావేరి అందుకుంటున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ పద్మవతి, స్కూల్ కమిటీ చైర్మన్ గౌస్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు నాగలదిన్నె విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్ ఖాసీం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీనివాసులు శనివారం తెలిపారు. స్కూల్ గే మ్స్ పోటీలో అండర్–17 విభాగంలో ఖాసీం ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగే రాష్ట్ర స్థాయి పో టీలో పాల్గొంటాడని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థిని

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నారాయణ కళాశాలలో ఫ్రెషర్స్ డేను శనివారం ఘనంగా జరుపుకున్నారు. నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ లింగేశ్వర రెడ్డి ముఖ్య అథితిగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డీన్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, ఏజీఎం రమణారెడ్డి, ఎట ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. రాఘవేంద్రచౌదరి, ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరురూరల్: విద్యార్థులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా. కె. రాఘవేంద్రచౌదరి అన్నారు. శనివారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రానికి ఆత్మ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జిల్లాలోని కడివెళ్ల, గాజులదిన్నె ఏపీ మోడల్ స్కూల్, కర్నూలు రవీంద్రా విద్యానికేతన్, పెద్దపాడు డీఎస్ఎం ప్రభుత్వ బాలికల పాఠశాల, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ దిన్నెదేవరపాడు, అరేకల్ పాఠశాలల విద్యార్థులు విజ్ఞాన యాత్రకు వచ్చారు. కేవీకేలో క్షేత్రస్థాయిలో ఏఏ పంటలు సాగు చేస్తున్నారు, గొర్రెలు, కోళ్లు, వర్మీ కంపోస్ట్ తయారీ ఇతర వాటిని పరిశీలించారు. కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వారికి పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.చందన్న, డా.నిరంజన్‌రెడ్డి, డా.మౌనిక, సుమంత్‌రెడ్డి, తేజకుమార్, ఏడీఏ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రణమండల చిత్రం పోస్టర్ విడుదల


పోస్టర్‌ను విడుదల చేస్తున్న నిర్మాత టీజీ విశ్వప్రసాద్, ఆలయ నిర్వాహకులు

ఆదోని అర్బన్: పట్టణశివారులోని రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం 'రణమండల' చిత్రం పోస్టర్‌ను నిర్మాత టీజీ విశ్వప్రసాద్ విడుదల చేశారు. ముందుగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అనంతరం పోస్టర్‌ను ఆలయ నిర్వాహకుడు టీజీ పాండురంగశెట్టి సమక్షంలో విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ ఆధ్యాత్మికమైన ఈ చిత్రం షూటింగ్ ఆదోనిలో కొంతమేర జరుగుతుందన్నారు. మరో 15 రోజుల తర్వాత ఇంకో చిత్రం షూటింగ్ ఆదోనిలో జరుగుతుందని తెలియజేశారు. తాను ఆదోనిలో పుట్టి పెరిగానని, ఎప్పుడైనా అమెరికా నుంచి వస్తే తప్పనిసరిగా ఆంజనేయస్వామి వారిని దర్శించుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మల్లప్ప, భక్తులు పాల్గొన్నారు.

29న ఆదోనిలో జాబ్ మేళా

ఆదోని సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ వారి ఆధ్వర్యంలో 29న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వివి.జనార్దన్ రెడ్డి శనివారం తెలిపారు. సాయి డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో క్విస్, దోంతస్, ఫ్రెష్‌ఫ్రూటీ, జ్యూస్ ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు ఇంటర్మీడియెట్, ఏదైనా డిగ్రీ చదివిన విద్యార్థులు అర్హులన్నారు. 30 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఎంపికై న వారు కర్నూలు జిల్లాలోనే పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. వీరికి నెలకు రూ.14,000 నుంచి రూ.18,000లు వరకు జీతం, ఇన్‌సెంటీవ్స్ ఉంటాయని తెలిపారు. ఫ్యాక్టరీ వర్క్ డెలవరీ వర్క్ పోస్టులకు పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, ఎదైనా డిగ్రీ చదివిన వారు అర్హులని, 100 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎంపికైన వారు బెంగళూరులో రెండేళ్ల తర్వాత నంద్యాలలో పని చేయాల్సి ఉంటుందన్నారు. వీరికి నెలకు రూ. 15,000లు వసతి కల్పిస్తారని తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెన్షనర్లకు ఉచిత వైద్య పరీక్షలు


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ధీరజ్ మెడికేర్ ఆస్పత్రిలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు ఉచిత ఆర్థో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్, డాక్టర్ కేఎస్ రఘు ప్రారంభించారు. శిబిరంలో పెన్షనర్లకు ఆర్థో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఏపి.వీరన్న మాట్లాడుతూ పెన్షనర్లకు ఉచిత వైద్యం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ నాయకులు సుందరీబాయ్, పోలు కంటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును మానుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: అధికారంలోకి వచ్చిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోను ప్రజల్లో భారం మోపేలా విద్యుత్ చార్జీలను పెంచమని చెప్పిన కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచేందుకు నిర్ణయం తీసుకోవడం శోచనీయమని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా అన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై రూ.6072.86కోట్ల భారాన్ని మోపేందుకు చర్యలు తీసుకోవండం దారుణమన్నారు. ప్రతి యునిట్‌పై గరిష్ఠంగా రూ.1.58 అదనంగా నవంబర్ నుంచి 15నెలల పాటు వసూలు చేసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు వీరేష్, మల్లికార్జునగౌడ్, నరసింహులు, ఖాజ,రామాంజినేయులు, అజారుద్దీన్, రవి,ఖాదర్, సమీర్ పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

ఆదోని అర్బన్: బస్సు ఢీకొనడంతో పట్టణంలోని రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన కృష్ణకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. శనివారం కృష్ణ బైకుపై ఆదోనికి వస్తుండగా ఎమ్మిగనూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో కృష్ణకు గాయాలైనట్లు వైద్య సిబ్బంది తెలిపారు.